హాల్ టికెట్ల జారీలో ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు

కాలేజీ యాజమాన్యాలకు కలెక్టర్ హెచ్చరిక

ఏలూరు :విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేయడంలో, ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వడంలో, అధిక ఫీజులు వసూలు చేసినా ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కాలేజీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. అంతేకాకుండా అటువంటి కళాశాలల గుర్తింపును రద్దు చేస్తామని తెలిపారు. జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికీ ఫీజు రియంబర్స్‌మెంట్ (ఆర్‌టిఎఫ్), మెస్ ఛార్జీలు(ఎంటిఎఫ్) మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏలూరు జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ విద్యార్థులను వేధింపులకు గురిచేయకుండా, వారికి అవసరమైన హాల్ టికెట్లు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తక్షణమే ఇవ్వాలని తెలిపారు. కలశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ హాల్ టికెట్లు ఇవ్వకపోయినా, ఒరిజినల్ ధ్రువపత్రాలు ఇవ్వకపోయినా, విద్యార్థులు కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ నెంబర్ 9491041188కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

మీ చావు.. మీరు చావండి..!

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో 'న్యూరో' సేవలకు తిలోదకాలు

ప్రజల ఆరోగ్యంతో పాలకుల చెలగాటం

సర్వజన ఆసుపత్రిలో ఉన్న ఒక్క న్యూరో డాక్టర్ బదిలీ

రెండు జిల్లాల్లో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ న్యూరో డాక్టర్ లేని వైనం

నరాల రోగులు, రోడ్డు ప్రమాద కేసులన్నీ సర్వజన ఆసుపత్రికే

ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చే వందల న్యూరో కేసుల పరిస్థితి ఏమిటి?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాన్య ప్రజల ఆరోగ్యం కోసం పట్టించుకునే పాలకులుగానీ, అధికారులుగానీ లేకుండా పోయారు. పేదల ప్రాణాలను గడ్డిపరకలా భావిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అత్యధికంగా ఎదుర్కొంటున్న సమస్యల్లో న్యూరో (నరాలకు) సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మినహా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ న్యూరో డాక్టర్ లేని పరిస్థితి. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఏలూరు సర్వజన ఆసుపత్రికి నరాల సంబంధిత రోగుల ప్రతి రోజు వందల సంఖ్యలో వస్తుంటారు. ఏలూరు జిల్లా ఆసుపత్రి సర్వజన ఆసుపత్రిగా మారడంతో వైద్యవిధాన పరిషత్ నుంచి పనిచేస్తున్న సీనియర్ డాక్టర్లను బదిలీ చేసిన పరిస్థితి నెలకొంది. గతంలోనూ ఇదే పరిస్థితి నెలకొనప్పుడు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జోక్యం చేసుకుని సీనియర్ డాక్టర్లను ఇక్కడే సేవలు అందించేలా ప్రభుత్వాన్ని ఒప్పించారు. ఇప్పుడు మాత్రం అందుకు విరుద్ధంగా పరిస్థితి తయారైంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఒకే ఒక్క న్యూరో డాక్టర్ రవికుమార్ పనిచేస్తున్నారు. సర్వజన ఆసుపత్రిగా మారినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకూ ఇక్కడ న్యూరో సర్జన్‌ను నియమించలేదు. దీంతో డాక్టర్ రవికుమార్ నరాల సంబంధిత కేసులన్నీ చూస్తున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి న్యూరో విభాగంలో ప్రతిరోజూ 80 మందికిపైగా రోగులు ఓపి సేవలు పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా, తలకు గాయాలైతే ఏలూరు సర్వజన ఆసుపత్రికే రిఫర్ చేస్తారు. ప్రతిరోజూ ఐదు నుంచి ఆరు కేసులు తలకు గాయాలకు సంబంధించి కేసులు సర్వజన ఆసుపత్రికి వస్తుంటాయి. తల నరాలు, కీళ్ల నరాలకు సంబంధించిన వందల మంది రోగులు సర్వజన ఆసుపత్రికి వస్తున్న పరిస్థితి. హఠాత్తుగా ఇక్కడ పనిచేస్తున్న న్యూరో డాక్టర్ రవికుమార్‌ను చింతలపూడి బదిలీ చేసేశారు. దీంతో న్యూరో డాక్టర్ లేక శనివారం ఆసుపత్రులకు వచ్చిన రోగులకు ఏంచేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ ఏలూరు సర్వజన ఆసుపత్రిలో 50 వరకూ సిటీస్కాన్, 30 వరకూ ఎంఆర్ఐ స్కానింగ్‌లు జరుగుతుంటాయి. వీటిలో తల (హెడ్), ఇతర నరాల సంబంధిత రోగులకు సంబంధించిన స్కానింగ్‌లు 15 నుంచి 20 వరకూ ఉంటాయి. దీన్నిబట్టి న్యూరో రోగుల తాకిడి ఏలూరు సర్వజన ఆసుపత్రికి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా ఆసుపత్రిని సర్వజన ఆసుపత్రిగా మార్చిన తర్వాత ఇక్కడకు వచ్చే ఆసుపత్రి పర్యవేక్షణ అధికారులు తీసుకునే నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతూనే ఉన్నాయి.

న్యూరో సర్జన్ రాకపోవడంతో రోగుల ఎదురుచూపులు



న్యూరో డాక్టర్ బదిలీ కావడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

వేరే డాక్టర్‌ను నియమించకుండా.. ఉన్న డాక్టర్‌ను పంపేస్తే ఎలా..

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఇద్దరు న్యూరో డాక్టర్లు అవసరం ఉంది. అత్యధికంగా న్యూరో కేసులు ఆసుపత్రికి వస్తున్నాయి. ఇప్పటివరకూ ఒకరే డాక్టర్ ఉండడంతో అత్యవసర కేసులు విజయవాడకు రిఫర్ చేయడం జరుగుతోంది. ఇప్పుడున్న ఒక్క డాక్టర్‌ను పంపేసిన పరిస్థితి నెలకొంది. వేరే డాక్టర్‌ను నియమించకుండా ఉన్న డాక్టర్‌ను పంపేస్తే రోగులు పరిస్థితి ఏంటో పాలకులుగానీ, అధికారులుగానీ ఏమాత్రం ఆలోచన చేయని పరిస్థితి నెలకొంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో గుండె, కిడ్నీ, ఊపరితిత్తులు వంటి కీలక రోగాలకు సంబంధించిన డాక్టర్లు లేకుండా పోయారు. ఇప్పుడు న్యూరో డాక్టర్‌ను సైతం పంపేయడంతో రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జనరల్ సర్జన్‌కు న్యూరో రోగులను అప్పగిస్తే రోగం ఏ విధంగా తగ్గుతుందో పాలకులు, ఉన్నతాధికారులే చెప్పాల్సి ఉంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిని దారిలో పెట్టడం, రోగులకు మరిన్ని సేవలందించడంలో జిల్లా అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వేరే డాక్టర్ వచ్చే వరకూ ప్రస్తుతం ఉన్న డాక్టర్ రవికుమార్‌ను కొనసాగించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకుని చర్యలు తీసుకుంటారో లేదో చూడాల్సి ఉంది.

చేతి నరాల సమస్యతో వచ్చాను..

పుష్పవతి, శ్రీపర్రు

'చాలా కాలంగా చేతినరాలకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నాను. ఇప్పటి వరకూ రెండు సార్లు వచ్చి వైద్యం చేయించుకున్నాను. మందులు వాడుతున్నాను. ఈ రోజు మళ్లీ వచ్చాను. డాక్టర్ లేరని చెబుతున్నారు. ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లి చూపించుకునే స్తోమత లేదు. మళ్లీ మందులు రాయాల్సి ఉంది. పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.'

పక్షవాతపు సమస్యతో మందులు వాడుతున్నాను

సిహెచ్ మంగ, ఏలూరు

నోరు, చేయి, కాలు వంకర తిరగడం వంటి పక్షవాతపు సమస్యలతో మందులు వాడుతున్నాను. రోగం చాలా వరకూ తగ్గింది. మరోసారి చూపించుకుని మందులు రాయించుకుందామని వచ్చాను. డాక్టర్ లేరని చెబుతున్నారు. ఏంచేయాలో తెలియడం లేదు.

ఎంఎల్‌సి జయమంగళ రాజీనామా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ తన పదవికి శనివారం రాజీనామా చేశారు. ఎంఎల్‌సి పదవితోపాటు వైసిపి పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఎంఎల్‌సి పదవికి చేసిన రాజీనామా లేఖను శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు పంపించారు. 2024 జరిగిన ఎన్నికల్లో వైసిపి ఘోర ఓటమి పాలైంది. అప్పటినుంచి జయమంగళ వైసిపికి దూరంగా ఉంటూ వచ్చారు. ఎంఎల్‌సి పదవికి, వైసిపి పార్టీకి రాజీనామా చేయడం వైసికి మరో షాక్ తగిలినట్లు అయ్యింది.

ల్యాండ్ బ్యాంక్ వివరాలు అందజేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ల్యాండ్ బ్యాంక్, అసైన్డ్ ల్యాండ్‌కు సంబంధించి సమగ్ర వివరాలు సమర్పించాలని తహశీల్దార్లను జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్‌డిఒలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు తదితరులతో వివిధ జాతీయ రహదారుల ప్రాజెక్టులు, చింతలపూడి లిఫ్టు ఇరిగేషన్, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి భూసేకరణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ పనులను సంబంధిత ఆర్‌డిఒలు ఎప్పటికప్పుడు సంబంధిత తహశీల్దార్లతో సమీక్షించి వేగవంతం అయ్యేలా చూడాలని ఆదేశించారు. రహదారుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, తదితర ప్రాధాన్యత అంశాలకు సంబంధించిన భూసేకరణ పనులు వేగవంతం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణకు సంబంధించి కోర్టుల్లో ఉన్న కేసులు సత్వరమే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కైకలూరు డంపింగ్ యార్డు, నూజివీడు, జంగారెడ్డిగూడెం ఎస్‌టిపిలకు సంబంధించి భూసేకరణపై కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రీరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఎంఎల్‌సిగా గెలిపించండి

టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - చింతలపూడి

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా తనను గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి కోరారు. చింతలపూడి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను, కళాశాలను ఆయన శనివారం సందర్శించారు. డిసెంబర్ 5న జరిగే ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను, అధ్యాపకులను కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పురేటి శ్రీనివాసరావు, మండల నాయకత్వం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోపీమూర్తి

వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలి

రైస్ మిల్లర్లకు జెసి ధాత్రిరెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

రైస్ మిల్లులకు వచ్చిన ధాన్యం వివరాలు, సిఎంఆర్ బియ్యం వివరాలను సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేసి ఉన్నతాధికారుల తనిఖీల సమయంలో తప్పనిసరిగా చూపించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రీరెడ్డి మిల్లర్లను ఆదేశించారు. కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శనివారం ఖరీఫ్ 2024-25 పంట కాలానికి ధాన్యం సేకరణ తరువాత సిఎంఆర్ బియ్యం పంపిణీ తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రైస్ మిల్లర్లు, పౌర సరఫరాల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎఫ్ఆర్‌కె అకౌంటు, వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఇంతవరకూ రూ.182.06 కోట్ల విలువైన 79,900 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 10 వేల 628 మంది రైతుల నుండి కొనుగోలు చేశామన్నారు. రైతులు పండించిన ధాన్యం నిర్దారిత నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటే రైస్ మిల్లర్లు నిర్ధారిత అంచనా సమయం లోపు ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు తగు హమాలీలను, ఇతర అవసరమైన అన్ని ఏర్పాట్లూ ఉండేలా చూసుకోవాలన్నారు.సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి ఆర్‌ఎస్‌ఎస్.రాజు, విజిలెన్స్ సివిల్ సప్లయ్ అధికారి దేవకీదేవి, జిల్లాలోని రైస్ మిల్లర్స్ పాల్గొన్నారు.

అదానీ కుంభకోణాలపై విచారణ జరపాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

ఏలూరు పాత బస్టాండ్ సెంటర్లో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గౌతమ్ అదానీ కుంభకోణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి అదానీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో సిపిఎం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ 2019 - 20 మధ్య అమెరికా కంపెనీలతో కలిపి అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. ఈ ఒప్పందాల్లో విద్యుత్ డిస్కాములతో ఒప్పందాలు చేసుకోవడానికి భారీగా ముడుపులు ఇచ్చారన్నారు. ఈ అవినీతి వ్యవహారాన్ని అమెరికా నిఘా సంస్థలు ఇప్పుడు బట్టబయలు చేశాయన్నారు. బిజెపి ప్రభుత్వం మోడీ ఆదేశాలతోనే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. కాబట్టి అదానీ గ్రూపుల మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అమెరికా న్యాయస్థానాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా వెంటనే గౌతమ్ అదానీపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గత రాష్ట్ర ప్రభుత్వం చేసిన తప్పిదాలను విమర్శించడమే కాకుండా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఈ కుంభకోణంపై విచారణ జరిపించి అదానీ సంస్థలతో జరిగిన ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.ఆదిశేషు, ఎ.శ్యామలారాణి, బి.జగన్నాధరావు, గోపి, ఎం.ఇస్సాక్, జి.శివకుమార్, మీసాల సత్యం పాల్గొన్నారు.

కుక్కునూరు : అదానీ గ్రూపుతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భయ్యాన శ్రీను డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యాన కుక్కునూరు ప్రధాన సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ సెకి నుండి విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర డిస్కాములు చేసుకున్న ఒప్పందం రాష్ట్రానికి నష్టదాయకమన్నారు. తొలి నుండి సిపిఎం వ్యతిరేకించడం, దాన్ని రద్దు చేయాలని కోరడం జరుగుతోందన్నాడు. 2019-20 మధ్య సెకి ఒప్పందమే గాక రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్లాంట్లు, విశాఖలో డేటా సెంటర్, గంగవరం పోర్టు వంటి వివిధ ప్రాజెక్టులను అదానీ గ్రూపు సంస్థలతో నాటి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుని ప్రభుత్వ ఆస్తులను, ప్రజల సంపదను వారికి ధారాదత్తం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, పట్ల లక్ష్మయ్య, వర్స వీరాస్వామి, సభ్యులు సురేష్, కడారి తిరపతయ్య, వెంకటేష్, రమేష్, వెంకట్రావు పాల్గొన్నారు.

కుక్కునూరులో ధర్నా చేస్తున్న నేతలు

బుట్టాయగూడెంలో..

బుట్టాయగూడెం : భారీ ఎత్తున అక్రమాలకు అవినీతికి పాల్పడిన అదానీని తక్షణం అరెస్టు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో బుట్టాయగూడెం సెంటర్లో నిరసన తెలిపారు. అనంతరం సిపిఎం మండల కమిటీ సభ్యులు పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన సభలో పార్టీ మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ఫ్రాన్సిస్, తామ ముత్యాలమ్మ మాట్లాడారు. పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అదానీ గ్రూపుతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న విద్యుత్, అన్ని రకాల ఒప్పందాలను తక్షణం రద్దు చేయాలని వారు ప్రభుత్వం డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా 26వ మహాసభలను జయప్రదం చేయండి

డిసెంబర్ 13, 14 15వ తేదీన బుట్టాయగూడెం లో జరిగే జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సిపిఎం ఆధ్వర్యంలోని ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. క్యార్యక్రమంలో ప్రజలంతా ఆర్థికంగా సహకారం అందించి సభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు చంద్రు బుల్లెమ్మ, పడకం శ్రీదేవి, తాటి రాంబాబు, పోడియం భీమరాజు పాల్గొన్నారు.

హేలాపురి బాలోత్సవం జయప్రదానికి పిలుపు

బ్రోచర్‌ను ఆవిష్కరించిన డిఇఒ వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - ఏలూరు

జనవరి 24, 25 తేదీల్లో నిర్వహించే హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల సంబరాలు విజయవంతం కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ పిలుపునిచ్చారు. నేడు డిఇఒ కార్యాలయంలో బాలోత్సవం బ్రోచర్‌ను ఆహ్వాన సంఘం పెద్దల సమక్షంలో డిఇఒ వెంకటలక్ష్మమ్మ ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఆహ్వాన సంఘం నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహరావు సమన్వయం చేశారు. మొదటి కాపీని ఆహ్వాన సంఘం ఛైర్మన్ అడుసుమిల్లి నిర్మల, అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్లు విజిఎంవిఆర్.కృష్ణారావు, ఎంఎస్ఎంఎస్.కుమార్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ గుడిపాటి నరసింహరావులకు అందించారు. అనంతరం డిఇఒ వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల్లో వివిధ రంగాలకు చెందిన పెద్దలు హేలాపురి బాలోత్సవం పేరుతో పిల్లల సంబరాలు నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు తెలిపారు. పిల్లలకు చదువుతోపాటు ఆటపాటలో అన్నింటిలోనూ అభివృద్ధి చెందడానికి అందరూ తోడ్పాటు అందించాలన్నారు. విద్యాలయాల వారు ప్రోత్సహించి బాలోత్సవంలో పాల్గొనేలా శిక్షణ ఇవ్వాలన్నారు. అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ ఐదో పిల్లల సంబరాలకు గతంలో వలె అన్ని తరగతుల వారు సహకరించాలని కోరారు. ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ నాలుగో పిల్లల సంబరాలు నిర్వహణకు తోడ్పడిన విధంగా దేశ భవిష్యత్తుకు తోడ్పడే ప్రయత్నానికి అందరూ సహకరించాలన్నారు. ఐదో పిల్లల సంబరాలు వట్లూరులోని సిద్ధార్థ వెస్ట్ స్కూల్‌లో నిర్వహించడానికి కమిటీ నిర్ణయించిందన్నారు. నాలుగు పిల్లల సంబరాల్లో పాల్గొన్న విధంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. విజిఎంవిఆర్ కృష్ణారావు మాట్లాడుతూ ఐదో బాలోత్సవం జయప్రదానికి ఆహ్వాన సంఘంలోని అందరూ పట్టుదలగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, పీడీ రత్నాకరరావు, ఎస్.కస్తూరిరావ్, వి.సురేష్, ఎ.మోహిని పద్మజావాణి, మేతర అజయ్ బాబు, ఎస్ఎన్.కట్టా, పి.కనకదుర్గ, ఎస్.రవి, కె.సోమలానాయక్, కె.శ్రీనివాసరావు, పి.శ్రీనివాస రావు, పి.భారతి, ఎ.కోహిమా, సుకన్య పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

పోలీసులకు ఆటవిడుపుగా ఆటల పోటీలు

ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్

ముగిసిన స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆటలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని, రేంజ్ పరిధిలో అన్ని జిల్లాల్లో ఈ స్పోర్ట్స్ మీట్స్ నిర్వహిస్తామని ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీసు మైదానంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సంవత్సరాంతపు ఆటల పోటీలు స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా ఏలూరు, పోలవరం, నూజివీడు, జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ల పరిధిలో ఉన్న పోలీసు ఆటగాళ్లతో పాటు ఏలూరు జిల్లా ఎఆర్ విభాగానికి చెందిన పోలీస్ ఆటగాళ్లు ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో పరుగు పందెం, వాలీబాల్, షటిల్, తగ్గాఫ్ వార్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా ఎఆర్ విభాగం అన్ని సబ్ డివిజన్లకు పోటీగా నిలిచింది. జిల్లా ఎఆర్ విభాగానికి సబ్ డివిజన్లకు హోరాహోరీ పోటీ నడిచింది. ఏలూరు సబ్ డివిజన్ పోలవరం సబ్ డివిజన్లు ఎక్కువ మొత్తంలో పథకాలను సాధించాయి. ఈ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి ఆటలు ఎందో దోహదపడతాయన్నారు. నిత్యం బిజీ జీవితాలతో గడిపే పోలీసులకు ఇది ఒక ఆటవిడుపని అన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో ప్రతి ఒక్క జిల్లాలో ఈ ఆటల పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. పాటల పోటీల్లో గెలిచిన ఆటగాళ్లకు ఆయన పతకాలను, ప్రశంస పత్రాలను అందించారు. ఈ ఆటల పోటీల్లో మహిళ సిబ్బంది కూడా పురుషులకు గట్టి పోటీ ఇచ్చారు. ఈ ఆటల పోటీల్లో పాల్గొన్నవారందరిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, డిఎస్‌పిలు శ్రావణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహరి, సిఐలు మల్లేశ్వరరావు, సుబ్బారావు, కోటేశ్వరరావు, ఎంవి.సుభాష్, సత్యశ్రీనివాస్, లక్ష్మణరావు, సత్యనారాయణ, రమణ, ఆర్ఐ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డిఐజి అశోక్‌కుమార్‌తో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

అత్యాచార నిందితులను శిక్షించాలి

ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విశాఖలో న్యాయవిద్య అభ్యసిస్తున్న విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఏలూరు జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.లెనిన్, పి.హైమావతి, ఎ.శ్యామలారాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు పిడిబిటి కాలేజీ నుంచి అశోక స్తంభం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశాల్లో, పాఠశాలల వద్ద, కళాశాలల వద్ద మహిళలకు, విద్యార్థులకు రక్షణ కరువైందని, ఈ వైఫల్యాలకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. బెంగాల్ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం మరువకముందే మరొక లా విద్యార్థినిపై క్రూరమైన దాడి జరగటం దారుణమన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యువత మత్తు పదార్థాలకు బానిసై మహిళలపై అత్యాచారాలకు, దాడులకు పాల్పడుతున్నారని, వెంటనే వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరిగే ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులకు కఠిన శిక్షలు అమలు చేయాలని, జస్టిస్ వర్మ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు ఎన్.ప్రవళిక, బి.లక్ష్మీకుమారి, ఎం.మమతకుమారి, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్ జయంత్, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నేతలు

పాఠశాల పనివేళలపై ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - ముసునూరు

విద్యా విధానాలు ఉన్నతంగా ఉన్న ఫిన్‌లాండ్ దేశంలో ఆరు పని గంటలు మాత్రమేనని, అలాంటిది మన రాష్ట్రంలో సమయం పెంచి ఎక్కువ గంటలు పని చేయించుకోవడం చట్ట విరుద్ధమని యుటిఎఫ్ మండలాధ్యక్షులు జి.పద్మకిషోర్ అన్నారు. ప్రభుత్వం పెంచిన పని గంటలపై మండలంలోని చెక్కపలి గ్రామంలో ఉపాధ్యాయులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పద్మకిషోర్ మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాల రోజులో ఏడు గంటలు కొనసాగుతుందని చెప్పారు. పాత పనివేళలే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి, కోశాధికారి నక్క నారాయణ, కౌన్సిల్ సభ్యురాలు పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆయుధ కర్మాగార నిర్మాణాన్ని వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో నిర్మించాలని చూస్తున్న కేంద్ర నేవీ ఆయుధ కర్మాగారాన్ని తిరిగి అదానీ దగ్గరకు పంపాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు అన్నారు. వంకవారిగూడెంలో ఆయుధ కర్మాగార నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఆదానీ దగ్గరకే నేవీ ఆయుధ కర్మాగారాన్ని కూడా పంపాలని విమర్శించారు. నేవి ఆయుధ కర్మాగార ఏర్పాటుకు మూడు సార్లు నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలంతా వ్యతిరేకంగా తీర్మానం చేసినా కూడా ఎంపీ జనవరి లేదా ఫిబ్రవరి నెలలో ఆయుధ కర్మాగారానికి శంకుస్థాపన చేస్తామమనడం ఏజెన్సీ ప్రాంతం నుంచి గిరిజనులను తరిమి కొట్టడమేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శిరిబత్తుల సీతారామయ్య, కారం నాగదుర్గ, మల్లుదొర, అబ్బులు, సంకూరుడు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎయిమ్ రాష్ట్ర నాయకుడు విల్సన్ మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం


విల్సన్ (ఫైల్‌ఫోటో)

ఎయిమ్ రాష్ట్ర, దళిత రాష్ట్ర నాయకుడు దూబా విల్సన్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మండల కేంద్రమైన టి.నరసాపురం గ్రామానికి చెందిన విల్సన్ దళిత ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ అంబేద్కర్ ఇండి మిషన్ (ఎయిమ్) రాష్ట్ర నాయకుడిగా పనిచేశారు. అంబేద్కర్ ఆశయసాధన, దళిత పంచాయతీ సాధనే లక్ష్యంగా పనిచేసిన ఆయన ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయన మృతికి రాష్ట్ర, జిల్లా, మండలంలోని దళిత, ఎయిమ్ నాయకులు నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మాగంటి బాబుకు నరసింహారావు పరామర్శ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మాగంటి బాబుతో నరసింహారావు

ఏలూరు మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (మాగంటిబాబు)ను టిడిపి కైకలూరు నియోజవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు శనివారం పరామర్శించారు. మాగంటి బాబు ఇటీవల ఆపరేషన్ చేయించుకుని ఏలూరు వచ్చారు. ఏలూరులోని మాగంటి బాబు స్వగృహంలో కలిసి, ఆయనకు జరిగిన ఆపరేషన్, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

భీమడోలులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రముఖుల పుట్టినరోజులను పురస్కరించుకుని అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం శ్రీ సత్య సాయి బాబా 99వ జయంతి కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఏలూరుకు చెందిన ఆశ్రం వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత జనరల్ వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షల అనంతరం మందులను పంపిణీ చేశారు. బాలవికాస్ విద్యా ర్థుల ఆధ్వ ర్యంలో నృత్య ప్రదర్శనలు, నాట్య ప్రదర్శనలు చేపట్టారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమానికి పలువురు హాజరయ్యారు.

నేరాలు - ఘోరాలు

అసిస్టెంట్ వాహన తనిఖీ అధికారికి తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అసిస్టెంట్ వాహన తనిఖీ అధికారి నెహ్రూకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాల ప్రకారం... రాజమండ్రికి చెందిన నెహ్రూ ఏలూరు ఉప రవాణ కమిషనర్ కార్యాలయంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయన ప్రతిరోజు రాజమండ్రి నుంచి ఏలూరు సర్వీస్ చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో శనివారం కూడా ఆయన రాజమండ్రిలో తన ఇంటి వద్ద నుంచి కార్యాలయ కారులో ఏలూరు జిల్లా ఉప రవాణ కమిషనర్ కార్యాలయానికి బయలుదేరారు. మార్గమధ్యంలో కొవ్వూరు సమీపానికి చేరుకునేసరికి కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కారులో నెహ్రూకు, అతని హోంగార్డుకు, డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. కారు మాత్రం పూర్తిగా నుజ్జయింది. ఎదురుగా వస్తున్న లారీని తప్పించిపోయి కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టినట్లు తెలుస్తుంది. ఈ ఘటనపై రవాణా శాఖ అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. ఏదేమైనప్పటికీ ప్రమాదం తప్పడంతో రవాణా శాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని కామయ్యపాలెం గ్రామ శివారులో నాటు సారా తయారీ స్థావరంపై ఎక్సైజ్ జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో శనివారం దాడులు చేశారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు.

ముసునూరు : మండలంలోని సూరేపల్లి గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో ఒక మహిళను అదుపులోకి తీసుకుని వద్ద నుంచి రెండు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐ పి.భోగేశ్వరరావు తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

వృద్ధురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి - టి.నరసాపురం

వృద్ధురాలు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి కె.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అల్లంచర్ల కొత్తగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు సూరబోయిన మాణిక్యం (80) షుగర్, కిడ్నీ వ్యాధితో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 22న కళ్లు తిరిగి పడిపోగా కుటుంబసభ్యులు స్థానిక ఆర్‌ఎంపి వద్ద వైద్యం చేయించగా షుగర్ తగ్గిందని టాబ్లెట్ వేయడంతో కోలుకోవడంతో ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం అదేరోజు ఉదయం 11.30 గంటలకు వృద్ధురాలికి వాంతులు అవుతుండడంతో ఏమైందని కుటుంబీకులు అడగగా అనారోగ్యం కారణంగా గుర్తు తెలియని మందు తాగానని చెప్పడంతో వెంటనే జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - కుక్కునూరు

ఎక్సైజ్ జంగారెడ్డిగూడెం సిఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో కుక్కునూరు మండల పరిధిలోని కొండపల్లి గ్రామంలో శనివారం దాడులు చేశారు. ఈ దాడిలో మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కోతుల బెడదతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుంపులుగా రోడ్లపై తిరుగుతున్న కోతులు

ముదినేపల్లి మండలంలో కోతుల బెడద తీవ్ర రూపం దాల్చింది. కోతుల బెడదతో గ్రామస్తులు భయందోళనలు చెందుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కోతులు జనవాసాల్లో, రోడ్లపై గుంపులు, గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడి చేస్తూ గాయపరిస్తున్నాయి. నిత్యం కోతుల దాడుల్లో మండలంలోని పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని ప్రజలు కోతుల దాడిలో పదుల సంఖ్యలో గాయపడితూ చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. మహిళలు, పిల్లలు, యువతీ, యువకులు, దారిన పొయ్యే పాదచరులు, ద్విచక్రవాహనదారులపై కోతులు దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో పల్లె ప్రజలు కోతుల బెడదతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ముదినేపల్లి అంబేద్కర్ నగర్‌లో గత రెండేళ్ల నుంచి ప్రజలు కోతులతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ముదినేపల్లిలో ఇటీవల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కోతులు పట్టే వారిని రప్పించి బోనులు ఏర్పాటు చేసి 120 కోతులను పట్టి భద్రాచలం అడవుల్లో విడిచిపెట్టారు. అయినప్పటికీ తప్పించుకున్న కొన్ని కోతులు మళ్లీ గ్రామంలోకి చొరబడి స్వైర్య విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కోతుల చేష్టలతో మండల ప్రజానీకం దిన దినం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ విషయమై ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులకు, గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు తెలియజేసినా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల తాకిడితో పిల్లలను బయటికి పంపాలంటే హడలిపోతున్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో కోతుల దాడిలో గాయపడి నిత్యం ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం వస్తున్నవారి సంఖ్య అధికంగా ఉంది. కోతులు ఇళ్లల్లో చొరబడి తినుబండారాలు ఎత్తుకుపోతున్నాయి. అడ్డగించే వారిపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. రోడ్లపై ప్రయాణించే ప్రజలు, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు కోతులతో భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని, కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ప్రజాశక్తి - పెదవేగి

సమాజంలో ప్రతి మహిళా చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో కె.రత్నప్రసాద్ అధ్యక్షతన పెదవేగి గ్రామంలోని ఎంపిడిఒ కార్యాలయంలో విధాన్ సే సమాధాన్ (చట్టంతో పరిష్కారం) ఫర్ ఉమెన్ బ్లాక్ లెవెల్ -2 మహిళ చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి మహిళా చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్ సంయుక్తంగా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళాభ్యున్నతికి అమలు చేస్తున్న పథకాలు, వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో గృహహింస, వరకట్న వేధింపులు, బాలికలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాధితులకు పరిహారం అంశాలపైన అవగాహన కల్పించారు. నేటి సమాజంలో సైబర్ నేరాలు పెరిగాయని, మొబైల్ ఫోన్లను తగు జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఎటువంటి ఉచిత న్యాయ సహాయానికైనా 15100కి కాల్ చేస్తే సంబంధిత అధికారులు స్పందించి న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి ఉమెన్ కమిషన్ మెంబర్ బి.వినీత, న్యాయవాదులు జి.మేరీసునీత, తిగిరిపల్లి సుబ్బారావు, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొనే సీతారాం, పెదవేగి సిఐ వెంకటేశ్వరరావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పివిఎన్.మునీశ్వరరావు, డిసిపిఒ సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కె.రత్నప్రసాద్

పేదల ఆరోగ్య భద్రతకు చర్యలు

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పేద ప్రజలకు పూర్తి ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయ నిధి కింద 15 మంది బాధితులకు సుమారు రూ.పది లక్షల విలువైన చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గత నాలుగు నెలల క్రితం వైద్యం చేసుకున్న ప్రతిఒక్కరూ సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం పొందవచ్చని తెలిపారు.

బిఎల్‌ఒలు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - ఏలూరు

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫోటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 24 తేదీ ఆదివారం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఆదేశించారు. అర్హులైన వారు 6,7, 8 దరఖాస్తు ఫారంలను పూర్తి చేసి ఇచ్చిన వాటిని స్వీకరించాలన్నారు. ఓటర్ల నమోదు అధికారులు, తహశీల్దార్లు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి సజావుగా శిబిరం నడుస్తుందో లేదో పరిశీలించాలని ఆదేశించారు. బిఎల్‌ఒలు స్వీకరించిన ఫారం 6,7,8 దరఖాస్తుల నివేదికను అదేరోజు సాయంత్రం ఐదు గంటలకు సంబంధిత తహశీల్దార్లకు సమర్పించాలని తెలిపారు.

4న ప్రజా హక్కుల సభ

ఆగిరిపల్లి : డిసెంబర్ నాలుగో తేదీన విజయవాడలో జరిగే ప్రజా హక్కుల సభను జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్)లిబరేషన్ ఏలూరు జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు కోరారు. ఈ మేరకు మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి లేని నిరుపేదలనకు భూమి, ఇళ్ల లేని వారికి ఉచితంగా ఇళ్ల నిర్మించి ఇవ్వాలని, ఉపాధి హామీ పథక కూలీలకు రోజుకు రూ.600 అందించడంతో పాటు, పని దినాలను 200 రోజులకు పెంచాలని, అన్ని రంగాల్లోని కార్మికులకు ఆరోగ్య బీమా వర్తింప చేయాలని, నిరుద్యోగులకు నెలకు రూ.ఐదు వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జిల్లా జడ్జి ఉద్యోగాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - ఏలూరు

జార్ఖండ్ రాష్ట్రంలోని హైకోర్టు పరిధిలో 15 జిల్లా జడ్జిల నియామకానికి ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జార్ఖండ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వారు సంబంధిత వివరాలు పంపినట్లు జిల్లా జడ్జి సి.పురుషోత్తంకుమార్ తెలిపారు. బార్ అసోషియేషన్ నుంచి అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్ ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీలోపు ధరఖాస్తు చేసుకోవచ్చున్నారు. జనరల్ అభ్యర్థులు రూ.1500, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి రూ.144840-194660(లెవెల్ జె-5) పే స్కేలు అమలు చేస్తారని తెలిపారు. పూర్తి రిక్రూట్ మెంట్ ప్రకటన, దరఖాస్తు ఫారాలను జార్ఖండ్ హైకోర్టు వెబ్‌సైట్ www.jharkhandhighcourt.nic.inలో పొందవచ్చని తెలిపారు.

ప్రభుత్వం ద్వారానే పిల్లలను దత్తత తీసుకోవాలి

జిల్లా శిశుగృహ మేనేజర్ కె.భార్గవి

ప్రజాశక్తి - కామవరపుకోట

పిల్లలు లేని తల్లిదండ్రులు ప్రభుత్వం ద్వారానే పిల్లలను దత్తత తీసుకోవాలని జిల్లా శిశుగృహ మేనేజర్ కె.భార్గవి అన్నారు. మండలంలో అంగన్వాడీ తడికలపూడి సెక్టార్ పరిధిలో దత్తత మాస ఉత్సవంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హాలులో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిశుగృహ మేనేజర్ కె.భార్గవి మాట్లాడుతూ పిల్లలు లేని తల్లిదండ్రులు, లీగల్ సంరక్షకులుగా లేని పిల్లలు ఎవరైనా ఉంటే ఎనిమిదేళ్ల నుంచి 18 ఏళ్ల లోపు పోస్టర్ కేర్ ద్వారా ప్రభుత్వం నుంచి దత్తతకు వెళ్లవచ్చన్నారు. పిల్లలను అక్రమంగా దత్తత తీసుకుంటే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ యూనిట్ సిబ్బంది పి.రాజేష్, వై.రాజ్‌కుమార్, అంగన్వాడీ తడికలపూడి సెక్టార్ సూపర్‌వైజర్ నంబూరి వీర కుమారి, గ్రామ మహిళా పోలీస్ పి.ప్రశాంతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అబ్బురపర్చిన కళాత్మక రూపాలు

ప్రజాశక్తి - దెందులూరు

విద్యార్థులు నిర్మించిన కళాత్మక రూపాలు

గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ వ్యవస్థ, పల్లె ప్రజల జీవన శైలి గ్రామీణ రైతుల వ్యవసాయ పద్ధతులు, మారుతున్న ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణను వివరిస్తూ ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ సంస్థ మార్యాపురం ఎన్ఎస్ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు పల్లె ప్రాంత ప్రజల వ్యవస్థీకృత జీవన స్థితి గతులను కొప్పాక గ్రామ పంచాయతీ వద్ద నేలపై అట్ట బొమ్మలతో నిర్మించిన గ్రామ స్వరూపం పలువురిని ఆకట్టుకుంది. వ్యవసాయ విద్యార్థులు పల్లెటూరిలో ప్రజలు నివసించే ఇళ్లు, వాళ్లు ఉపయోగించే వాహనాలు, యంత్ర పరికరాలు రహదారులు, చెరువులు, పంట కాలువలు దగ్గరలోనే వ్యవసాయ పంటల సాగు విధి విధానాలు వంటి కళాత్మక రూపాలు నిర్మించిన తీరు చూపరులను అబ్బుర పరిచాయి. ఇంతటి నైపుణ్యాన్ని కనబరచిన మార్యాపురం ఎన్ఎస్ వ్యవసాయ కళాశాల విద్యార్థులను గ్రామ సర్పంచి పరశురాం భాస్కర్ దీక్షితులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.ఫణికుమార్, విస్తరణ శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబు, పెదవేగి మండల వ్యవసాయాధికారి ప్రియాంక, కొప్పాక రైతులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అన్ని తరగతుల ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో శనివారం తనను కలిసి వినతులందించేందుకు వచ్చిన పలువురు ప్రజలు, రైతులను ఎంఎల్ఎ కలిశారు. వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుని, పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తుందన్నారు. పలువురు ఎంఎల్ఎ చంటిని మర్యాదపూర్వకంగా కలుసుకుని, ఘనంగా సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు మామిళ్లపల్లి పార్థసారథి, బెల్లపుకొండ కిషోర్, చల్ల ప్రసాద్ పాల్గొన్నారు.

చింతలపూడి అభివృద్ధికి సహకరించాలి

సిఎం చంద్రబాబును కోరిన ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధిపై సిఎం చంద్రబాబుతో ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ చర్చించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం చింతలపూడి నియోజవర్గ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సంబంధించి సిఎం చంద్ర బాబును ఎంఎల్ఎ రోషన్‌కుమార్ కలిశారు. చింతల పూడి, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. కామవర పుకోట మండలంలోని హనుమంతరావు ఎర్రకాలువ ఎత్తిపో తల పథకం పైపులైన్ మరమ్మతులకు ప్రత్యేక నిధులు మం జూరు చేయాలని కోరినట్లు చెప్పారు. మండలంలోని గుంటు పల్లిలో పిపిపి విధానంలో బౌద్ధ ఆరామాల అభివృద్ధి, పర్యా టక కేంద్రంగా రూపొందించే ప్రతిపాదన పెట్టినట్లు తెలిపారు.

కొల్లేరు ప్రజల సమస్యలు పరిష్కరించాలి

దెందులూరు : రాష్ట్రంలో మత్స్యకారులు, కొల్లేరు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఎం చంద్రబాబును, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ను జనసేన రాష్ట్ర కార్యదర్శి, దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఘంటసాల వెంకటలక్ష్మి కోరారు. సిఎం చంద్రబాబును అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాల యంలో ఆమె శనివారం కలిశారు. యానాం మాజీ మంత్రి, ప్రస్తుత పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృషారావు ఆధ్వర్యంలో మత్స్యకార సామాజిక తరతగి, మత్స్యకారుల ప్రాంతానికి చెందిన మంత్రులు, ఎంఎల్‌ఎలు, మత్స్యకార ప్రతినిధులతో పాటు కలిసి సమస్యలను వివరించి, వాటిని పరిష్కరించమని కోరినట్లు తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - భీమడోలు

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ భీమడోలు సిఐ బి.సత్యనారాయణ కోరారు. తమ శాఖ ఆధ్వర్యంలో భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల వేదికగా శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉత్తమ సమాజ స్థాపన, ఉజ్వల భవిష్యత్తు కోసం ఆరోగ్యకరమైన సమాజ స్థాపన అంశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, జాతీయ సేవా పథకం కెడెట్ల భాగస్వామ్యంతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ భీమడోలు ఎస్ఐ శశిధర్, కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ రవి కుమార్, భవాని సింగ్ పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్‌పిడిబిటి జూనియర్ కాలేజీలో స్టూడెంట్స్‌కు మాదకద్రవ్యాలపై అవగాహనా సదస్సు ఏలూరు ఎక్సైజ్ స్టేషన్ సిఐ జివిఎస్.కృష్ణ ధనరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల మనుషులు శారీరకంగా, మానసికంగా బలహీనపడి జీవితాలు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. ఏలూరు గవర్నమెంట్ హాస్పిటల్‌లో మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసలైన వారికి డి అడిక్షన్ సెంటర్ ఉందని తెలిపారు. అనంతరం ఎక్సైజ్ సిఐ, సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రిలోని డి అడిక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ మూర్తి, గవర్నమెంట్ హాస్పిటల్ మెడికల్ కౌన్సిలర్లు, ఎస్ఐలు పి.సుధీర్, వై.గౌరీశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆధ్వర్యంలో మండలంలోని సుంకొల్లు గ్రామంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి మస్తానయ్య మాట్లాడుతూ నాటు సారా, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించడం వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. ఎవరైనా బెల్టుషాపులు నిర్వహించినా, నాటు సారా తయారుచేసినా, అమ్మినా చర్యలు తీసుకుంటామన్నారు. 9949539933కి సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

జీలుగుమిల్లి : కామయ్యపాలెంలో మత్తు పదార్థాల వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నాటు సారా తయారుచేసినా, అమ్మినా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికైనా తెలిస్తే 9618521855 సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, ఇఎస్ స్క్వాడ్ ఎస్ఐ ఎమ్‌డి.ఆరిఫ్, స్టేషన్ ఎస్ఐలు సుబ్రహ్మణ్యం, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : నాటు సారా, గంజాయి, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని ఎక్సైజ్ సిఐ పి.అశోక్ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడెంలో శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగంపై శనివారం క్విజ్ పోటీ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు తెలిపారు. మండల స్థాయిలో భారత రాజ్యాంగం బిఆర్.అంబేద్కర్ అంశం పై జరిగిన క్విజ్ పోటీలో కామవరపుకోట, ఆడమిల్లి రావికంపాడు ఉన్నత పాఠశాలకు చెందిన 75 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు భారత రాజ్యాంగం దినోత్సవం రోజు నగదు బహుమతి, ప్రశంస పత్రాలు అందిస్తామని తెలిపారు.

రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మండంలోని లోపూడి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు టిడిపి నాయకులు శనివారం పర్యవేక్షించారు. గత నెల రోజుల క్రితం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి లోపూడి గ్రామపంచాయతీ పరిధిలో రూ.21 80 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు వారు తెలిపారు. ఆ రోడ్ల నిర్మాణ పనులను టిడిపి గ్రామ నాయకులు మల్లేశ్వరరావు, లక్కపాము కాంతారావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ పర్యవేక్షించారు.

'ఎంఎల్‌సి ఎన్నికల్లో నారాయణరావును గెలిపించాలి'

ప్రజాశక్తి - కుక్కునూరు

డిసెంబర్ ఐదో తేదీన జరిగే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో గంధం నారాయణరావును గెలిపించాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర కోరారు. ఈ మేరకు మండలంలోని పలు పాఠశాలలను ఆయన శనివారం సందర్శించి గంధం నారాయణరావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుక్కునూరు మండల నాయకులు గండి సత్యనారాయణ, పోడియం రామకృష్ణ, కోడి వెంకటేశ్వరరావు, కేదార నరేష్, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి ఎఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) 49వ రాష్ట్ర మహాసభలు విజయనగరంలో నవంబర్ 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్ తెలిపారు. నూజివీడులోని శ్రీ సిద్దార్థ జూనియర్ కళాశాలలో శనివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ విద్య ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. యువగలం పాదయాత్రలో ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగంలో ఉన్న సమస్యలపై విజయనగరంలో జరుగుతున్న మహాసభలో సుదీర్ఘంగా నాలుగు రోజులపాటు చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడ్డేటి వంశీ, ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు IX Addl. డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
I.A. 370/2024
A.S. /2024
S.R. 1121/2024
Between:
పిటీషనర్లు/ (Appellants):
1. Smt. Nuthangi Chandra Leela
2. Kum. Nuthangi Sirisha
AND
రెస్పాండెంట్లు:
Tadigadapa Seetha Ramamma and 8 Others
To:
4. Nuthangi Sesha Pavan Kumar, S/o. Alleged Jeevamadhuram, Gantavari Street, Chintalapudi, Chintalapudi Mandal, West Godavari District, now at Present Eluru District.
పై నెంబరులోని పిటీషనర్లు (అప్పిలెంట్లు) మీ వగైరాలపై అప్పీలు దాఖలు చేసుకొని సదరు అప్పీలు దాఖలు చేయుటలో జరిగిన 555 days Delay Condone చేయించమని పై నెంబరున పిటీషను దాఖలు చేసుకొని యున్నారు. సదరు పిటీషనులో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల మీరు ది. 05-12-2024వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలియపరచుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించడమగును.
M/s. G.RAMAKRISHNA
K.BALA RAMARAJU
MADDIPATI SRINIVAS
Advocates, Kovvur

డాక్యుమెంట్స్ పోయినవి
నా క్లయింట్ దాయన ఏడుకొండలు, తండ్రి దాయన (లేటు) వెంకటేశ్వరరావు, 11వ వార్డు, సత్యవతినగర్, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా వారు ఇచ్చిన సంజాయిషీపై తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ దాయన ఏడుకొండలు తండ్రి దాయన (లేటు) వెంకటేశ్వరరావు గారు ది.11-11-2024 సం.తేదీన జిరాక్స్ నిమిత్తం నా క్లయింట్ ఇంటికి సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్ (దస్తావేజు నెంబర్లు : 1843/1982, 4846/1988, 3387/1996, 96/1997) గల ఇంటికి సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్ తీసుకొని ఇంటి వద్ద నుండి సాయంత్రం సుమారు 6 గంటలకు మోటార్ సైకిల్‌పై క్యారీ బ్యాగ్‌తో తాలుకాఫీస్ సెంటర్‌కు బయలుదేరుగా, మార్గమధ్యలో పడిపోయినవి. ఎంత వెతికినను, ఎంక్వైరీ చేసినను దొరకలేదు. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు ఇంటికి సంబంధించిన పై తెలిపిన ఒరిజినల్ లింక్ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నా క్లయింట్ అడ్రస్‌కి గాని, నాకు గాని తెలియజేయగలరు.
నా క్లయింట్ చిరునామా : దాయన ఏడుకొండలు, తండ్రి దాయన (లేటు) వెంకటేశ్వరరావు, 11వ వార్డు, సత్యవతినగర్, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.
కంకట శ్రీనివాసరావు, అడ్వకేట్, కొండ్రుప్రోలు, తాడేపల్లిగూడెం మండలం. సెల్: 9989524989